



విద్యార్థినుల నృత్యాలు

# ముగ్గుల హరివిల్లు

- బాపట్లలో రంగవల్లుల సంబరం
- శోభాయమానంగా ఆంధ్రరత్న మార్గ్
- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి విశేష స్పందన
- విజేతలకు బహుమతుల అందజేసిన జీఎస్ఆర్ బిల్డర్స్



బాపట్లలో హరివిల్లులకు రంగులు దిద్దుతున్న మహిళలు

బాపట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వారం ముందే సంక్రాంతి వచ్చిందా అనేంత సంబరంగా బాపట్లలో ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు జరిగాయి. పోటీకి మహిళలు, విద్యార్థినుల నుంచి విశేష స్పందన లభించగా ఆ ప్రాంతంలో ముగ్గుల హరివిల్లు ఆవిష్కృతమైంది. చిట్టిచేతులతో చిన్నారులు.. కొంగుబిగించిన మహిళలు.. రంగవల్లులను తీర్చిదిద్దారు. ఇలపైకి ఇంద్రధనుస్సు దిగివచ్చిందా అన్న రీతిలో రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. సందేశాత్మకంగా, సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి శోభను ముందస్తుగా కళ్లకు కట్టినట్లుగా రంగవల్లులను మహిళలు, యువతులు తీర్చిదిద్దారు. చిట్టిచేతులతో చిన్నారులు తమ ప్రతిభ చూపిస్తే, కొంగుబిగించి మహిళలు సరికొత్త రంగుల ఇంద్రధనస్సును భువిపైకి దించారు. యువతరం ఆలోచనలను ప్రతిబింబించేలా కళాశాల విద్యార్థినులు ముగ్గులు వేశారు. ఇలా చిన్నా పెద్ద తేడా లేకుండా 130 మంది నారీమణులు ఉత్సాహంగా ముగ్గుల పోటీలో భాగస్వాములయ్యారు. ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిందని అతిథులు హర్షం వ్యక్తం చేశారు. సంక్రాంతి విశిష్టతను తెలిపే ముగ్గులతో పాటు నవధాన్యాల విశిష్టతను వివరించే రంగవల్లులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు, యువతులు, విద్యార్థినులు హాజరయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులను తీర్చిదిద్దారు. పోటీల నేపథ్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహిళలు, విద్యార్థినులతో పాటు చిన్నారులు సైతం ముగ్గుల సంబరంలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. బాపట్ల ఫైర్ స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో రంగవల్లులను తీర్చిదిద్దారు. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్ణ సీమ సుకేతన సంయుక్తంగా ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ శ్రీభ్రమర టౌన్ షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా జీఎస్ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ సహకారంతో జరి గిన ముగ్గుల పోటీలు కన్నుల పండుగగా జరిగాయి. పోటీలో పాల్గొన్న వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గుం డ్రెడ్డి శివ సహకారంతో అంద జేశారు. ప్రథమ బహుమతి మే నిగ లక్ష్మీప్రసన్న, రెండో బహు మతిని కర్ణాటక లక్ష్మి, తృతీయ బహుమతి రావూరి అంజని అందుకున్నారు.

## డీఎస్పీ ప్రోత్సాహక బహుమతులు

ముగ్గుల పోటీలను బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రారంభించి పోటీల్లో పాల్గొన్న వారికి అభినందనలు తెలిపారు. అంతరించి పోతున్న సంప్రదాయాలను కాపాడడంలో ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు దోహదపడుతున్నాయిని కొనియాడారు. రంగవల్లుల పోటీకి పెద్దసంఖ్యలో మహిళలు, విద్యార్థినులు తరలి రావడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పోటీలో పాల్గొన్న వారికి ప్రోత్సాహకరంగా ఆయన స్వయంగా ఐదుగురికి కన్సోలేషన్ బహుమతి కింద నగదు పురస్కారాన్ని అందజేశారు. డీఎస్పీ సతీమణి రేణుక, కుమారుడు విజయ్‌కుమార్‌తో కలిసి రంగవల్లులను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ముగ్గుల పోటీలకు స్పందన ఎక్కువగా ఉండడంతో జూనియర్స్ విభాగం పేరిట విద్యార్థినులకు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను బాపట్ల మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ ప్రారంభించారు. ప్రోత్సాహక నగదు పురస్కారం అందుకున్న వారిలో చిన్నారి స్వీటీ ఉండగా, కళాశాల విద్యార్థినులు నలుగురు ఉన్నారు.

### రాష్ట్ర స్థాయి విజేతే లక్ష్యం

నా పుట్టిల్లు బాపట్ల మండలం జిల్లెల్లమూడి గ్రామం. మెట్టినిల్లు ఒంగోలు. ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతిగా నిలవడం ఆనందంగా ఉంది. నా లక్ష్యం రాష్ట్ర స్థాయిలో ప్రథమ విజేతగా నిలవడమే. ఈ సారి ఎలాగైనా దానిని సాధిస్తాను.

**- లక్ష్మీ ప్రసన్న, ప్రథమ బహుమతి విజేత**





### మాకెప్పుడూ ముగ్గులు ప్రత్యేకమే..

సంక్రాంతి వచ్చిందంటే మాకు ఎప్పుడూ ముగ్గులు ప్రత్యేకమే. రంగవల్లులు వేయడంలో పోటీ పడడమంటే ఎంతో ఆనందం. ఈ పోటీలలో ద్వితీయ బహుమతి రావడం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఇంతమందితో కలిసి పాల్గొనడం మధురానుభూతిగా మిగలనుంది.

**- కర్ణాటక లక్ష్మి, బాపట్ల, ద్వితీయ బహుమతి**





### ఆంధ్రజ్యోతి ప్రయత్నం అభినందనీయం

నానాటికీ కనుమరు గవుతున్న సంప్రదాయాలను కాపాడే ప్రయ త్నంలో భాగంగా ఆంధ్రజ్యోతి రంగవల్లుల పోటీ నిర్వహించడం ఆనందంగా ఉంది. ముఖ్యంగా తెలుగు లోగిళ్లలో ఆనందాల హరివిల్లు విరబూసే సంక్రాంతి ముంగిట ఇలా వేడుకలు జరపడం అభినందనీయం.

**- రావూరి అంజని, బాపట్ల, తృతీయ బహుమతి**







ముగ్గుల పోటీల వద్ద మాట్లాడుతున్న బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు





జీఎస్ఆర్ బిల్డర్స్ అధినేత గుండ్రెడ్డి శివ నుంచి ప్రథమ బహుమతి అందుకుంటున్న మేనిగ లక్ష్మీప్రసన్న



అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణకుమారి నుంచి ద్వితీయ బహుమతి అందుకుంటున్న కర్ణాటక లక్ష్మీ



ముగ్గులు వేస్తున్న యువతులు



అసిస్టెంట్ సీడీపీవో నుంచి తృతీయ బహుమతి అందుకుంటున్న రావూరి అంజని

# 8న నీటి విడుదల

- తీరనున్న తాగు నీటి వెతలు
- 5 టీఎంసీలు కేటాయించిన కేఆర్ఎంబీ
- సాగర్ నుంచి రోజుకు 5 వేల క్యూసెక్కులు


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో తాగునీటి ఎద్దడి తీరనున్నది. నాగార్జున సాగర్ జలశయం నుంచి నీటి విడుదలకు కేఆర్ఎంబీ అనుమతి ఇచ్చింది. ఈ నెల 8న డ్యాం నుంచి కేవలం తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేయనున్నారు. నిండుకున్న చెరువులు.. తాగునీటి ప్రజల ఇక్కట్లు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతితో శనివారం కథనం వెలువడిని విషయం తెలిసిందే. ఈ క్రమంలో 5 టీఎంసీల నీటిని కేఆర్ఎంబీ కేటాయించింది. రోజుకు 5 వేల క్యూసెక్కుల చొప్పున కుడి కాల్వకు 11 రోజుల పాటు నీటి సరఫరా చేయనున్నారు. సాగర్ నుంచి నీటిని విడుదల చేయనుండటంతో మున్సిపాల్టీలతో పాటు పల్లెల్లోనూ తాగునీటి ఇక్కట్లు తీరనున్నాయి.

**అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి**

తాగునీటి అవసరాలకు మాత్రమే కుడి కాల్వకు నీటి సరఫరా జరగనున్నది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు అప్రమత్తంగా వ్యహరించాల్సి ఉంది. 11 రోజుల మాత్రమే నీటి సరఫరా చేయనుండటంతో చెరువులను నింపేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసుకోవాలి. చిలకలూరిపేట, సత్తెనపల్లి, వినుకొండ, నరసరావుపేట మున్సిపల్ అధికారులు చెరువులు నింపేందుకు ఇంజన్లు ఏర్పాటు చేసుకోవాలని జలవనరుల శాఖ సూచించింది. ఏ మాత్రం అశ్రద్ధ వహించినా చెరువులు నిండే పరిస్థితి ఉండదు. మళ్లీ నీటి కోసం ఏప్రిల్ మొదటి వారం వరకు ఆగాల్సి ఉంటుంది. ఈ క్ర మంలో అధికారులు చెరువులను నింపే విషయంలో జాగ్రత్త వహించాల్సి ఉంది. కాగా చెరువులను నింపేందుకుఅన్ని ఏర్పాట్లు చేశామని పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కుడి కా ల్వకు విడుదలయ్యే నీటిని పం టలకు వినియోగించవద్దని రైతులకు అధికారులు సూచిస్తున్నారు.



సాగర్ కుడి కాలువ

# వైసీపీకి లావు గుడ్‌బై?



**రత్తయ్యతో టచ్‌లోకి టీడీపీ నేతలు?**

ఎంపీ తండ్రి రత్తయ్యతో ఉ మ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ముఖ్య నేతలు టచ్‌లోకి వచ్చినట్లు తెలిసింది. వివాదర హితుడిగా వ్యవహరిస్తున్న శ్రీకృష్ణదేవరా యులను తమ పార్టీలోకి స్వాగతిస్తామని చెప్పినట్లు తెలిసింది. శ్రీకృష్ణదేవరాయులు కోరుకున్నట్లు నరసరావుపేట నుంచి తమ పార్టీ తరఫున పోటీ చేసే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు కూడా సమాచారం. గత ఎన్నికల్లో అక్కడ నుంచి పోటీ చేసి ఓటమి చెం దిన రాయపాటి వయసు రీత్యా పెద్దవా రు కావడంతో, ఆ సీటుకు ఎవరినీ ఇ ప్పటి వరకు టీడీపీ ఎంపిక చేయలేదు. అయితే తన కుమారుడితోనూ, తమ శ్రే యోభిలాషులతోను చర్చించి ఒక నిర్ణయానికి రావాలనే ఉద్దేశంలో రత్తయ్య ఉన్నారని సమాచారం.

- ఎంపీకి పొమ్మనకుండా పొగబెట్టిన జగన్
- ఏం తప్పు చేశానని సీటు మారమన్నారని శ్రీకృష్ణదేవరాయులు ఆగ్రహం
- నాడు గుంటూరంటే నరసరావుపేట.. నేడు నరసరావుపేటే అంటే గుంటూరనడం తగునా
- రాజధాని రైతుల వద్దకు ఏ ముఖం పెట్టుకొని వెళ్ళి ఓట్లు అడగ్గలం...
- కింకర్తవ్యం ఏమిటంటూ ఆంతరంగికులతో భేటీ....
- టీడీపీలోకి రావాలంటూ లావుకు జిల్లా ముఖ్య నేతల ఆహ్వానం...

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వైసీపీని వీడే అవకాశం కనిపిస్తున్నది. 2019 ఎన్నికల సమయంలో విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య నరసరావుపేట ఎంపీ స్థానం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. అయితే అప్పటికే రాయపాటి సాంబశివరావుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడంతో అవకాశం చేజారింది. దీంతో అప్పటికప్పుడు ఆయన తన కుమారుడు శ్రీకృష్ణదేవరాయులకు వైసీపీ టిక్కెట్ ఇప్పించుకుని ఎన్నికల బరిలోకి దింపారు. ఆ ఎన్నికల్లో రాయపాటిపై లక్షన్నర మెజార్టీతో శ్రీకృష్ణదేవరాయులు గెలుపొందారు. రాజకీయాలు కొత్త అయినప్పటికీ గెలిచిన నాటి నుంచి నిత్యం జనం మధ్యే ఉంటూ నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి ఆయన శ్రమించారు. సీఎం జగన్‌తో మొదటి నుంచి శ్రీకృష్ణదేవరాయులకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. తొలినాళ్లలో లావు మాటకు జగన్ ఎంతో విలువిచ్చేవారు. అయితే నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజిని మూలంగా చిన్నచిన్నగా లావు జగన్‌కు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆ పార్టీ వర్గాల విశ్లేషణ. అంతేకాకుండా రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడిన జగన్‌పై ద్వేషంతో భూములిచ్చిన రైతులు చేస్తున్న ఉద్యమం తీవ్ర స్థాయికి చేరుకున్న సమయంలో వారి వద్దకు వెళ్లి ధైర్యం చెప్పే సాహసం వైసీపీ నేతలెవరూ చేయలేక పోయారు. ఆ సమయంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు చొరవ చేసుకుని వైసీపీ ప్రతినిధిగా రైతుల శిబిరం వద్దకు వెళ్లి వారిని ఓదార్చే ప్రయత్నం చేశారు. తమ వద్దకు వచ్చి తమ వాదన విన్నందుకు లావును రైతులు ప్రశంసించారు. అయితే ఇది నచ్చని సీఎం జగన్ అప్పటి నుంచి లావుపై మరింత అక్కసు పెంచుకున్నారు. అంతే కాకుండా టీడీపీపైన, ఆ పార్టీ అధినేత చంద్రబాబుపైనా లావు తిట్లదాడి చేయకపోవటం కూడా జగన్‌కు నచ్చలేదు. దీంతో అప్పటి వరకు గుర్తుకు రాని లావు సామాజిక వర్గం హఠాత్తుగా జగన్‌కు గుర్తుకొచ్చి కొద్ది రోజులుగా ఆయనపై సవతి తల్లి ధోరణితో వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆయనతో తగాదా పెట్టుకున్న రజినికి ఏకంగా మంత్రి పదవి కట్టబెట్టటం.. చిలకలూరిపేటలో ఓడిపోయే దశలో ఉన్న రజినిని గుంటూరు పశ్చిమకు రప్పించటం శ్రీకృష్ణదేవరాయులకు పుండు మీద కారం చల్లినట్లైంది.

**సీటు లేకుండా చేసేందుకే మార్పిడి వంక..**

అరాచకాలే కాకుండా అసభ్యకరమైన పనులు చేస్తున్న వారిని కూడా వెనుకేసుకొస్తూ వారు కోరుకున్న సీట్లు ఇచ్చేందుకు భరోసా ఇస్తున్న జగన్ వ్యూహాత్మకంగానే ఎంపీ లావుకు పొగపెట్టారన్న ఆరోపణలున్నాయి. నిజాయితీగా వ్యవహరిస్తూ.. అభివృద్ధి కోసం తనవంతుగా పరితపిస్తూ తన పనితీరు ద్వారా స్వపక్షంలోనే కాకుండా విపక్షీయుల ప్రశంసలు కూడా అందుకున్న లావును పిలిచి ఉన్న పళంగా నియోజకవర్గం మారాలని కోరటం విచిత్రం. విశేషమేమిటంటే అదే లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో జనం చీదరించుకునే సిట్టింగ్‌లు ఉండగా ఇప్పటి వరకు వారి జోలికే వెళ్లకుండా హడావుడిగా లావును మార్చే ప్రయత్నం చేయడం ఆ పార్టీ వర్గాలనే విస్మయ పరిచింది. నియోజకవర్గం మారేందుకు ఇష్టపడని లావు సీఎం జగన్ ముఖాన్నే ఆ విషయం చెప్పేశారు. అప్పట్లో గుంటూరు అడిగితే నరసరావుపేట వెళ్ళమన్నారు.. ఇప్పుడు నరసరావుపేట నుంచి గుంటూరుకు పొమ్మంటున్నారు.. ఏం తప్పు చేశానని సీటు మారాలి అని సీఎంను ప్రశ్నించినట్లు తెలిసింది. పైగా రాజధాని ఇక్కడే ఉంటుందని ఎన్నికల ముందు మనం హామీ ఇచ్చి విస్మరించి వారికి ద్రోహం చేశాం.. గుంటూరు నుంచి పోటీ చేస్తే ఇప్పుడు వారి వద్దకు వెళ్లి ఏం ముఖం పెట్టుకుని వెళతామంటూ కోపంగా సీఎంవో నుంచి బయటకు వచ్చేశారని సమాచారం. అదే చివరి సారి ఆ గడప తొక్కటం అనే భావనకు కూడా ఆయన వచ్చినట్లు సన్నిహితులు చెబుతున్నారు.



మందడం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు

# ప్రజా రాజధాని అమరావతిపై జగన్ కుట్రలు

**● మూడు ముక్కల ఆట వైసీపీ వారి ప్రయోజనం కోసమే**

**● 1481వ రోజుకు రైతుల ఆందోళనలు**

తుళ్లూరు, జనవరి 6: అద్భుతమైన ప్రజా రాజధాని అమరావతిని నాశనం చేయడానికి సీఎం జగన్‌రెడ్డి ఎత్తుగడ వేశారని 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, హైకోర్టు తీర్పును అమలుచేసి రాజధాని అభివృద్ధిని కొనసాగించాలంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1481వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి పలువురు రైతులు మాట్లాడుతూ 33వేల ఎకరాలలో పెద్ద పెద్ద రోడ్లు, బ్లూ అండ్ గ్రీనరీతో ఎంతో అద్భుతమైన ఆహ్లాదకరంగా, రాష్ట్రానికి సంపదనిచ్చే అమరావతిని నిర్వీర్యం చేయటానికి మనసు ఎలా ఒప్పిందని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మూడు ముక్కల ఆట దరిద్రం రాష్ట్ర ప్రజలకు వద్దని, ప్రత్యేక హోదా తెచ్చి మూడు ప్రాంతాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాత మనుగడను ప్రశ్నార్థకం చేసి విశాఖ రాజధాని అని సీఎం జగన్‌రెడ్డి చెప్పడం దారుణమన్నారు. మూడు రాజధానులు కావాలని ఎవరూ అడగలేదన్నారు. స్వప్రయోజనాల కోసమే మూడు రాజధానుల ప్రతిపాదన చేశారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం, మందడం, వెలగపూడి తదితర రాజధాని గ్రామాల్లోని రైతు ధర్నా శిబిరాలలో ఆందోళనలు కొనసాగాయి.

## మహిళ ఆత్మహత్య

సత్తెనపల్లి, జనవరి 6: అనారోగ్య కారణాలతో డాబా పైనుంచి దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని కోళ్ళమూడివారి వీధిలో గురువారం రాత్రి జరిగింది. వీధిలో నివశిస్తున్న తొమ్మంద్రు నాగ భూషణం భార్య సంతోషలక్ష్మి(40) అనారోగ్య కారణంగా తమ డాబా పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె సోదరుడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ప్రభాకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆత్మహత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఉత్పాదక రంగాలను నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**● పోరాటాలకు వ్యవసాయ కార్మికులు సిద్ధం కావాలి**

**● వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు విజయ్ రాఘవన్**



మాట్లాడుతున్న విజయ్‌రాఘవన్, వేదికపై ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి 6: దేశంలో ఉత్పాదక రంగాలకు ప్రోత్సాహకాలు ఇవ్వకుండా కేవలం సేవారంగంపై ఆధారపడి కేంద్ర ప్రభుత్వం ఆర్థికవ్యవస్థని అస్తవ్యస్తం చేస్తోందని ఆల్ ఇండియా వ్యవసాయ కార్మికసంఘం జాతీయ అధ్యక్షుడు ఎ.విజయ్‌రాఘవన్ చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ రంగ సంక్షోభం.. వ్యవసాయకార్మికులపై ప్రభావం.. భూసమస్య, దాని ప్రాధాన్యత అనే అంశంపై రాష్ట్ర సదస్సు శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సదస్సుకు వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. విజయ్ రాఘవన్ మాట్లాడుతూ సేవారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధారపడుతున్నాయని, ఇందువల్ల రాబోయే కాలంలో ఆర్థిక సంక్షోభం మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఆహార ఉత్పత్తులు తగ్గి ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని, ఆ పార్టీకి మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు కష్టపడి ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేస్తే వారికి కనీసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనివ్వడం లేదన్నారు. మొత్తం జీడీపీలో 40శాతం వ్యవసాయరంగం నుంచి వస్తున్నా ఈ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో భూపంపిణీని మేనిఫెస్టోలో పెట్టే పార్టీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో ఇప్పటికీ 64శాతం మంది వ్యవసాయరంగంపై ఆధారపడి ఉంటే ఈ రంగాన్ని కేంద్రప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తున్నద న్నారు. నూతన ఆర్థిక విధానాల అమలు తరువాత రైతులకు తగిన ప్రోత్సాహం లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్ వంకాయలపాటి శివనాగరాణి, గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తదితరులు ప్రసంగించారు.

# తక్షణమే జీవో నెం.2ను ఉపసంహరించాలి

**● అంగన్‌వాడీలకు అండగా తెలుగుదేశం**

**● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు**



వినుకొండ, జనవరి 6: అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం జగన్‌మోహన్‌రెడ్డి నిరంకుశ పాలనకు, పెత్తందారీ పోకడలకు నిదర్శనమని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అంగన్‌వాడీలు తక్షణమే విధులకు హాజరుకావాలంటూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.2ను ఉపసంహరించుకోవాలని అన్నారు. అంగన్‌వాడీల కన్నీటితో జగన్‌రెడ్డి ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ సమ్మె నిషేధించడానికి రాష్ట్రం ఏమైనా జగన్‌రెడ్డి జాగీరా అని నిలదీశారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. జీవోలతో అంగన్‌వాడీల న్యాయపోరాటాన్ని అడ్డుకోలేరన్నారు. అంగన్‌వాడీలకు తెలుగుదేశం అండగా నిలుస్తుందని అన్నారు. అంతిమ విజయం అంగన్‌వాడీలదే అని, ఒక్కో అంగన్‌వాడీ కార్యకర్త అపరకాళిగా మారి జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూలదోయడం ఖాయమన్నారు.

## ఎస్మా ప్రయోగం నియంత పాలనకు నిదర్శనం

సత్తెనపల్లి, జనవరి 6: అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రభుత్వం ప్రయోగించటం నియంత పోకడలకు నిదర్శనమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారికి జీతాల్లో కూడా కోత విధించటం దుర్మార్గం అన్నారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతూ 25 రోజులుగా సమ్మె చేయటం అన్యాయమా? అని ప్రశ్నించారు. జీవో నెం.2ను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. ఎస్మా ప్రయోగం ద్వారా సీఎం అరాచక పాలన అర్థమవుతుందన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి టీడీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. అంగన్‌వాడీల కన్నీటిలో జగన్ ప్రభుత్వం కొట్టుకుపోవటం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

## నేడు మంగళగిరిలో లోకేశ్ పర్యటన

**● కుటుంబసభ్యులతో కలిసి ఆలయాల సందర్శన**

మంగళగిరి, జనవరి 6: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదివారం మంగళగిరి పట్టణంలో పర్యటించనున్నారు. కుటుంబసభ్యులతో కలిసి వివిధ దేవాలయాలను సందర్శించనున్నారు. తొలుత ఉదయం పది గంటలకు శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి విచ్చేస్తారు. శ్రీవారిని దర్శించుకుని కిరీటం సమర్పిస్తారు. అనంతరం పట్టువస్త్రాలు సమర్పించి వేదపండితుల ఆశీర్వచనం తీసుకుంటారు. అక్కడి నుంచి సమీపంలో వున్న శివాలయంలో శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తదనంతరం పానకాల స్వామి నడకమార్గంలో మెట్ల పూజలో పాల్గొంటారు. ఎగువ సన్నిధిలో స్వయంభువుగా వెలిసిన పానకాల స్వామిని దర్శించుకుని, రాజ్యలక్ష్మీ అమ్మవారికి హారం, పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

## ఓట్ల కోసం పెట్టుకున్న తప్పుడు దరఖాస్తులు గుర్తించాలి

**● ఆర్డీవోకు ఎమ్మెల్యే అనగాని లేఖ**

రేపల్లె, జనవరి 6: ఓ నర్సింగ్ కళాశాలలో ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు 80 మంది ఎలాంటి ప్రూఫ్‌లు లేకపోయినా ఓట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని తక్షణమే పరిశీలించి రిజెక్టు చెయ్యాలని ఆర్డీవో హేలా షోరాన్‌కు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ లేఖ రాశారు. నియోజకవర్గంలోని చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి గ్రామంలో ఉన్న శృతి నర్సింగ్ కాలేజీలో ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. వీరు తమ రాష్ట్రంలో ఓటర్లుగా నమోదై ఉన్నారు. అయినా గుళ్ళపల్లి గ్రామ పంచాయతీలో కొత్తగా 80మంది ఓట్ల కొరకు దరఖాస్తు చేశారు. పరిశీలించి ఈ దరఖాస్తులను రిజెక్టు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఇదే తంతు...

**● పింఛన్లు పంపిణీ చేసిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి అశోక్‌బాబు**



పింఛన్లు పంపిణీ చేస్తున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అశోక్‌బాబు

భట్టిప్రోలు, జనవరి 6: మండలంలో అధికారులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అర్హత లేని వారి చేత అధికారిక కార్యక్రమాలు జరిపిస్తున్నారు. ప్రజల నుండి ప్రతిపక్షాల నుండి విమర్శలు వస్తున్నప్పటికీ అధికారుల తీరు మారడం లేదు. మండలంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి ఆశోక్‌బాబు పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఎంపీపీ, జడ్పీటీసీలతో పాటు ఇన్‌ఛార్జి అశోక్‌బాబు చేత కూడా పింఛన్లను పంపిణీ చేయించామని సమాధానమిచ్చారు. ఆయన ప్రజాప్రతినిధి కాదుకదా అని ప్రశ్నించగా, ఆ విషయం మాకు తెలియదని ఎంపీడీవో బదులిచ్చారు.

# వైసీపీ అరాచక పాలన తరిమికొట్టేందుకే రా కదలిరా..

**● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట అర్బన్, జనవరి 6: రాష్ట్రాన్ని జగన్ విముక్తం చేసి వైసీపీ అరాచక పాలనను తమిరికొట్టడమే తెలుగుదేశం పార్టీ రా కదలిరా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టు పట్టించిన సైకోను సాగనంపితేనే ఈ రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ నిరంకుశ, అవినీతి, రాక్షస ఏలుబడిని తుదముట్టించటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చిలకలూరిపేటలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలను బటన్ నొక్కుతున్నామన్న భ్రమల్లో ఉంచి వేల కోట్లు దోచుకున్న జగన్‌కు పాలించే అర్హత లేదన్నారు. రాష్ట్రం మొత్తంలో బులుగు బ్యాచ్ 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు తినేశారని, అందులో 40వేల ఎకరాలు విశాఖ భూములేనన్నారు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, డ్రగ్స్, గంజాయి, ఎర్రచందనం రూపంలో జగన్‌రెడ్డి కుటుంబం రూ.3.5లక్షల కోట్లు కొల్లగొట్టిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ అన్న తేడా లేకుండా కనిపించిన భూమినల్లా వైసీపీ నేతలు కబ్జా చేస్తున్నారని, దారితప్పిన ఈ పరిస్థితులను చక్కదిద్దాలంటే టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యమని తెలిపారు. వైసీపీ పాలనలో బీసీలకు జరిగిన అన్యాయంపై వారిలో చైతన్యం కలిగించేందుకు జయహో బీసీ కార్యక్రమంతో టీడీపీ ప్రజల ముందుకు వచ్చిందని, బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన పార్టీ టీడీపీయేనన్నారు. వైసీపీ పాలనలో 52.5 శాతంగా ఉన్న బీసీలు, మైనార్టీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

# జనసేన-టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

**● జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు**

**● పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం**



సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

తెనాలి క్రైం, జనవరి 6: జనసేన, టీడీపీలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు తెలిపారు. శనివారం సాయంత్రం జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ జగన్ పాలనలో సామాన్యుల బతుకులు దుర్భరంగా మారాయన్నారు. సర్వే ప్రకారం గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రం నుండి 24 లక్షల మంది వలసలు వెళ్ళారన్నారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ పెద్దలు ప్రోత్సాహంతో అరకు వ్యాలీలో వేల ఎకరాల్లో గంజాయి సాగు అవుతుందని, దీంతో దేశంలో ఏ ప్రాంతంలోనైనా అరకు గంజాయి లభిస్తుందని, గంజాయి సాగు, అమ్మకం సాగిస్తూ రూ.కొట్లు గడించారని ఆరోపించారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో కరువు, దోపిడీలు, దౌర్జన్యాలు, బీభత్సం, అవినీతి తప్ప మరేమీ కనిపించడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో సామాన్యులు కోరుకుంటుంది కడుపు నింపే ఉపాధి, విద్య, వైద్యం లాంటివి మాత్రమేనని అన్నారు. చంద్రబాబునాయుడు ప్రజాస్వామ్యవాది, విజన్ ఉన్న నేత అని అన్నారు. చంద్రబాబు లాంటి నాయకుడు ఆలోచనలు రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. నాదెండ్ల మనోహర్ జనసేన పార్టీకి కట్టుబడి శక్తి వంచన లేకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఆయన జనసేన పార్టీకి దొరకడం మా అదృష్టం అన్నారు. సమావేశంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ వేమూరి అజయ్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు సుందరపు సతీష్‌కుమార్, బండారు రవికాంత్, ఇస్మాయిల్‌బేగ్, పసుపులేటి మురళీకృష్ణ, హరిదాసు గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## గాడితప్పిన ఆంధ్రాను పట్టాలెక్కించేందుకు అందరూ కదలిరావాలి

**మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్**

అచ్చంపేట, జనవరి 6: గాడితప్పిన ఆంధ్రప్రదేశ్‌ను పట్టాలు ఎక్కించటం కోసం ప్రతి ఒక్కరు కదలిరావాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ సైకో జగన్‌రెడ్డి పాలన గాడితప్పటంతో ఆంధ్రరాష్ట్రాన్ని పట్టాలు ఎక్కించటం కోసం చంద్రబాబునాయుడు రా కదలిరా... నినాదంతో ఎన్నికల శంఖారావం పూరించార న్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సోదరులు దగా పడ్డారని, నిరుద్యోగ యువత ఉద్యోగావకాశాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నార న్నారు. జగన్‌రెడ్డి కుర్చీ కోసం కులాల మధ్య చిచ్చుపెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నారని.. ప్రజలందరూ గమనించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూములనే తేడా లేకుండా భూకబ్జాలు చేస్తున్నారని, సైకో పాలనలో ఆడ బిడ్డల మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బీసీలకు రాజకీయం గా అవకాశం కల్పించింది టీడీపీయేనని తెలిపారు.

# నూతన భవన సముదాయానికి నాట్కో ట్రస్ట్ రూ.6లక్షల విరాళం

గుంటూరు (తూర్పు), జనవరి 6: జేకేసీ రోడ్డు లోని కమ్మజనసేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో ఒక గది నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం రూ 6లక్షలను నాట్కో ట్రస్టీ నన్నపనేని సదాశివరావు ప్రకటించా రు. ఈ మేరకు కుందులరోడ్డులోని కమ్మజనసేవా సమితి బాలికల వసతిగృహంలో శనివారం సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్‌కు చెక్కును సదాశివ రావు అందజేశారు. అనంతరం చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ నాట్కో ట్రస్ట్ గతంలో కూడా ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6లక్షలు అందజేసిందని గుర్తుచేశారు. నగరపాలక సంస్థ అధికారుల నుంచి అనుమతి రాగానే నూతన భవననిర్మాణం ప్రారంభిస్తామన్నారు. నన్నపనేని సదాశివరావు మాట్లాడుతూ నిర్మాణం ప్రారంభమవ్వగానే నాట్కో ట్రస్ట్ తరుపున భారీ విరాళం అందజే స్తామన్నారు. అనంతరం దాతలను చుక్కపల్లి రమేష్ సత్కరించారు. కార్యక్రమంలో షిర్డి సాయి సేవా సమితి గౌరవ అధ్యక్షుడు, జిల్లా నాట్కో క్యాన్సర్ యూనిట్ పర్యవేక్షకుడు యడ్లపాటి ఆశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాట్కో ట్రస్టీ నన్నపనేని సదాశివరావుకు జ్ఞాపికను అందజేస్తున్న చుక్కపల్లి రమేష్

# సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

**● 10 నుంచి అందుబాటులోకి స్పెషల్ బస్సులు**

**● వీటికీ సాధారణ ఛార్జీలే**

గుంటూరు, జనవరి 6: సంక్రాంతి పర్వదినానికి ప్రయాణీకుల రద్దీకనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేస్తోంది. ఈ నెల 10వ తేదీ నుంచి అదనపు సర్వీసులను అందుబాటులోకి తెస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.రవికాంత్ శనివారం తెలిపారు. పండుగకు జిల్లాకు వచ్చే ప్రయాణీకుల కోసం ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు 135 సర్వీసులను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. అలానే పండుగ ముగిసిన తరువాత తిరుగు ప్రయాణీకుల కోసం 16వ తేదీ నుంచి 18 వరకు రద్దీకి అనుగుణంగా సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. అదనపు సర్వీసులకు కూడా సాధారణ ఛార్జీలే అమలు చేస్తున్నట్లు చెప్పారు. గుంటూరు-1, 2, పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోలలో స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాను, పోను టిక్కెట్‌లు రిజర్వేషన్ చేసుకొన్న వారికి ఛార్జీలో పది శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

● ప్రతి నెల 20వ తేదీన డయల్ యువర్ జిల్లా ప్రజా రవాణాధికారి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీకి సంబంధించి సూచనలు, సలహాలు, ఫిర్యాదులను 99592 25412కు ఫోన్ చేయాలని కోరారు.

# సభ్యత్వం కావాలా.. సొమ్ము కట్టు!

**● లేదా.. తక్కువ కిరాయికి లారీ పెట్టు**

**● కనీసం 10 ట్రిప్పులైనా రవాణా చేసిపెట్టు**

**● లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో వైసీపీ నేత దందా**

**● రోజుకో విషయం వెలుగు చూస్తున్న వైనం**

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్' పేరుతో వైసీపీ నేత సాగిస్తున్న దందాలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతులు పంపాలంటే ఎవరైనా సరే వీరిని ఆశ్రయించాల్సిన పరిస్థితిని కల్పించారు. తాజాగా అసోసియేషన్ సభ్యత్వం పేరుతో లారీ ఓనర్స్ వద్ద పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఎవరైనా కొత్త లారీ కొనుగోలు చేసి అసోసియేషన్‌లో సభ్యత్వం కోసం అర్జీ పెట్టుకుంటే సభ్యత్వాన్ని వెంటనే ఇవ్వరు. పలు రకాల షరతులు పెడతారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు అతి తక్కువ ధరలకు కనీసం 10 ట్రిప్పులు చేయాలని చెబుతారు. ఒక లారీ దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు వారు చెప్పినన్ని ట్రిప్పులు వేయాలంటే కనీసం ఏడాది సమయం పడుతుంది. అంత జరిగినా చివరికి సభ్యత్వ రుసుం అంటూ రూ.30 వేలు చెల్లించాల్సిందేనని పట్టుబడతారు. ఇవేమీ లేకుండా సభ్యత్వం కావాలంటే రూ.70 వేలు అనధికారికంగా వసూలు చేస్తారు. అవి వారి జేబుల్లోకే వెళతాయి. లారీ ఓనర్స్ అసోసియేషన్ తొలి నుంచి వివాదాల మధ్యనే కొనసాగుతోంది. మొదట్లో నల్లచెరువులో ఈ అసోసియేషన్ ఉండేది. అప్పట్లో ఆ ప్రాంతంలో పేరు మోసిన రౌడీషీటర్ల పెత్తనం ఉండేది. ఆ రోజుల్లోనే లారీకి రూ.30 వేలు చొప్పున వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. ఇక్కడ ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారడంతో అసోసియేషన్‌ని ఆటోనగర్‌కు తరలించారు. దాదాపుగా 4 ఎకరాలకు పైగా స్థలాన్ని లారీ ఓనర్స్ అసోసియేషన్‌కి కేటాయించారు. అసోసియేషన్‌లో గుత్తాధిపత్యం కోసం ఒక నాయకుడి హత్య కూడా జరిగింది. మొదట్లో 150 మంది లారీ ఓనర్లే ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య దాదాపుగా 650కి చేరింది. దాదాపు పదిహేనేళ్లుగా వైసీపీ నేత ఒకరు ప్రెసిడెంట్‌గా ఉంటూ నియంతలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. లారీ యజమానుల సమస్యలను పరిష్కరించాల్సిన అసోసియేషన్.. ఒక విధంగా ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్ పాత్ర పోషిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఎగుమతిదారుల స్వేచ్ఛని హరిస్తుండటం దేశంలో మరెక్కడా లేదు. ఎవరైనా అభ్యంతరం పెడితే తమ నాయకుడు జగన్ మరో 30 ఏళ్ల పాటు సీఎంగా ఉంటారని, ఎవరూ ఏమీ చేయలేరని గద్దిస్తున్నారు.

**ట్రిప్పునకు 30 వేలు!**

ఈశాన్య రాష్ట్రాల ట్రిపునకు ఏ లారీ వెళ్లినా రూ.30 వేల చొప్పున వైసీపీ నేత రాబడతారని అసోసియేషన్‌లో చెప్పుకోవడం గమనార్హం. అలాంటిది సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఏపీఐఐసీ వేసిన ఆటోనగర్ లేఅవుట్‌లో ఉన్న ఈ స్థలంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవు. అనేకమార్లు లారీ ఓనర్లు మొర పెట్టుకోవడంతో ఇటీవలే కొంత మట్టి పోయించి చదను చేయించారు. తమ వద్ద వసూలు చేస్తున్న సొమ్ము ఏమవుతోందని పలువురు యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఈ అసోసియేషన్‌కి ఏటా లేదా రెండేళ్లకు ఒకసారైనా ఎన్నికలు జరిగేలా చూడాలని వారు కోరుతోన్నారు.

## నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

## బ్రాయిలర్ ధరలు

**అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్**

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 83, 98, 105 |
| చికెన్ విత్ స్కిన్ | 170.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 180.00 |

# రంగవల్లులతో పులకించిన భావపురి

● పండుగ వాతావరణంలో ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు



బాపట్లలో హరివిల్లులకు రంగులు దిద్దుతున్న మహిళలు

బాపట్ల, జనవరి 6 : ముగ్గులు వేసేందుకు వచ్చిన మహిళలు, యువతులతో బాపట్లలోని ఆంధ్రరత్నమార్గ్ పులికించింది. సంక్రాంతి శోభ ఉట్టిపడేలా ముగ్గులను అలంకరించారు. మేము సైతమంటూ ఇంజనీరింగ్ విద్యార్థినులతోపాటు గిరిజన వసతి గృహం విద్యార్థినులు పోటీలో పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన సంయుక్తంగా జీఎస్సార్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత, కర్లపాలెం మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గుంద్రెడ్డి శివ సౌజన్యంతో వేడుకగా జరిగాయి. పోటీలో తీర్చిదిద్దిన ముగ్గులను చూచేందుకు తరలి వచ్చిన వారితో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. పోటీలో విద్యార్థినులను ప్రత్యేకంగా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఫణిమైథలి ప్రథమ, బి.వైష్ణవి ద్వితీయ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థిని మంజుభార్గవి తృతీయ, గిరిజన సంక్షేమ వసతిగృహం విద్యార్థిని స్వీటికి స్పెషల్ బహుమతిని అందజేశారు. బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా రూ.10 వేలను ప్రోత్సాహక బహుమతి కింద అందజేశారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పోటీలకు హాజరైన బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల, గిరిజన సంక్షేమ వసతిగృహం విద్యార్థినులు ఆటపాటలతో అలరించారు. మహిళలతోపాటు వచ్చిన చిన్నారులు సైతం నృత్యాలు చేశారు. పోటీలు చూచేందుకు వచ్చిన హరిదాసులు సైతం సంకీర్తనలు పాడుతూ కనిపించారు. ఈ కార్యక్రమంలో స్పాన్సర్ గుంద్రెడ్డి శివ, సీడీపీవో బి.శైలజ, ఏసీడీపీవో ఎస్.లక్ష్మీ పార్వతి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ జి.లక్ష్మి, మహిళా ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణకుమారి, మున్సిపల్ హైస్కూల్ పీడీ కత్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ముత్యాల ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



మాట్లాడుతున్న నరేంద్రవర్మ, చిత్రంలో జనసేన కోఆర్డినేటర్ వెంకటశివన్నారాయణ

## మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జనవరి 6 : మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ డిమాండ్ చేశారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి జనసేన, టీడీపీ నాయకులతో కలిసి నరేంద్రవర్మ సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్తలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, ప్రస్తుతం పారిశుధ్య కార్మికుల పట్ల కూడా నిర్లక్ష్యం చూపితే సహించేదిలేదన్నారు. మున్సిపల్ కార్మికుల డిమాండ్లలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమానవేతనం ఇవ్వాలన్నారు. తెలుగుదేశం అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేరుస్తామన్నారు. జనసేనపార్టీ కోఆర్డినేటర్ నామన వెంకట శివన్నారాయణ మాట్లాడుతూ సైకో ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీలు నేటికి నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జె.శామ్యూల్, జెబి.శ్రీధర్, టీడీపీ పట్టణాధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, కూచిపూడి ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

● బాపట్ల, జనవరి 6 : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె నాల్గవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్లేకార్డులు చేతబూని కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. న్యాయమైన తన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.సత్యవతి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి బి.శామ్యూల్, జి.నాగమణి, ఎం.అంకాలు, నరసయ్య, డి.దుర్గ మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.

● రేపల్లె, జనవరి 6 : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం 4వరోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా జగన్మోహన్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులను మోసం చేశారన్నారు. ఈకార్యక్రమంలో సిరంశెట్టి శ్రీనివాసరావు, దుర్గారావు, సత్యవతి, కుసుమ పాల్గొన్నారు.

● బాపట్ల, జనవరి 6 : సమస్యలు పరిష్కరించమని ఎస్మా ప్రయోగించటం దారుణమని వెంటనే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ప్యాఫ్ట్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఎస్మా చట్టాన్ని ఉపసంహరించి వారిని చర్చలకు పిలిపించి డిమాండ్స్ పరిష్కారంలో చొరవ చూపాలని ప్యాఫ్టో చైర్మన్ బడుగు శ్రీనివాస్, కార్యదర్శి సి.హెచ్.టివి సురేష్ కోరారు.

## రేపు రావో అండ్ రాజు 5కే రన్ పోటీలు

పిట్టలవానిపాలెం జనవరి 6 : మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీకళాశాల ప్రాంగణంలో ఈనెల 8న రావో అండ్ రాజు 5కె రన్ పోటీలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్ శనివారం తెలిపారు. ఒంగోలుకు చెందిన రిటైర్డ్ పీడీ సీహెచ్ వెంకటేశ్వరరావు సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయి పురుషుల 5కె రన్, బాపట్ల నియోజకవర్గ పరిధిలోని ఉన్నత పాఠశాలలకు చెందిన సీనియర్ బాలుర 3కె రన్, బాలికల 2కె రన్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొనదలిచిన విద్యార్థిని, విద్యార్థులు సోమవారం మధ్యాహ్నం 12.30 నిమిషాలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్‌నెంబర్లు 9440529307, 9059808491 సంప్రదించాలని తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

బాపట్ల, జనవరి 6 : మాదిగ స్టూడెంట్స్ సమైక్య జాతీయ సమావేశానికి అనుమతి నిరాకరించటంపై ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అనుమతి నిరాకరించటం సరికాదన్నారు. మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు బురదగుంట్ల లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ వైస్ చాన్స్‌లర్ గౌరవప్రదమైన వృత్తిలో ఉంటూ రాజకీయ పార్టీలకు కొమ్ముకాయటం చూస్తుంటే మాదిగలను అణగదొక్కాలని చూస్తున్నట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. బాపట్ల జిల్లా ఎమ్మార్పీఎస్ కోకన్వీనర్ దుడ్డు వందనం మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం మాదిగల పట్ల వ్యవహరిస్తున్న వ్యతిరేక తీరును మార్చుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తాళ్ళూరి రాజేష్, బి.వెంకటేశ్వరరావు, కె.అబ్రహం, గొల్లం మంద మత్తయ్య, యాజలి గోపి, నాగరాజు, డేవిడ్, రవి పాల్గొన్నారు.

## మోదీ పాలనపై ప్రజల్లో అచంచలమైన విశ్వాసం

● రాజ్యసభ సభ్యుడు బాబు భాయ్‌దేశ్

వేమూరు, జనవరి 6 : దేశంలోని ప్రజలకు నరేంద్రమోదీ పాలనపై అచంచలమైన విశ్వాసం ఏర్పడిందని గుజరాత్ రాష్ట్రానికి చెందిన రాజ్యసభ సభ్యులు బాబుభాయ్‌దేశ్ అన్నారు. వేమూరులో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీడీవో అనురాధ అధ్యక్షత వహించారు. బాబు భాయ్ దేశ్ మాట్లాడుతూ ప్రధాని కేంద్ర ప్రభుత్వం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సం బంధించిన అనేక పథకాలను ప్రవేశపెట్టారు. వాటిని అర్హులైన లబ్ధిదారులకు అందించే బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఎంతైనా ఉం దన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూ డా మరింత ప్రాధాన్యమిస్తూ కేంద్ర ప్రభుత్వం మరికొన్ని పథకాలను ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలు పథకాల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈవోపీఆర్డీ శేఖర్, 17 గ్రామాల పంచాయతీల కార్యదర్శి సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, బీజేపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలను పంపిణీ చేస్తున్న బాబుభాయ్‌దేశ్

## రూరల్ ఎస్సై కొండారెడ్డి బదిలీ

బాపట్ల, జనవరి 6 : బాపట్ల రూరల్ ఎస్సై కొండారెడ్డి పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. ఇటీవల చెరుకుపల్లి నుంచి బదిలీపై వచ్చిన ఆయన పల్నాడు జిల్లాకు వెళ్ళారు. దీంతో ఆయన స్థానంలో పట్టణ ఎస్సై సింగయ్యను ఇన్‌చార్జిగా నియమించారు.

## బెల్లం ఊట ధ్వంసం, మద్యం స్వాధీనం

బాపట్ల, జనవరి 6 : సెబ్ సీఐ ఎస్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం స్టూవర్టుపురంలో కర్రెద్దుల బాలరాజు నాటుసారా తయారు చేస్తున్నట్లు గుర్తించి 300 లీటర్లు బెల్లంఊటను ధ్వంసం చేశారు. అదే విధంగా మరుప్రోలువారిపాలెంలో కొణతల భూషణం అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి దాడి చేసి 8 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ తెలిపారు.

## వృక్షనగర్‌లో నాటుసారా స్వాధీనం

బాపట్ల, జనవరి 6 : మండలంలోని వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఎస్సై ఎం.అనిత సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. వృక్షనగర్‌లో 8 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

## సంఘాలు అనుసంధానంగా ఉండాలి : డీఈవో

బాపట్ల, జనవరి 6 : ఉపాధ్యాయ సంఘాలు అధికారులకు, ఉపాధ్యాయులకు అనుసంధానంగా ఉండాలని డీఈవో పీవీజే రామారావు కోరారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ్ డైరీ, క్యాలెండర్‌ను శనివారం సంఘనాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి పూర్ణ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌కుమార్, కోశాధికారి రామ్మోహనరావు, ఇతర నాయకులు పాల్గొని డీఈవోను సత్కరించారు.

## దరఖాస్తులపై పారదర్శకంగా విచారణ చేయాలి : కలెక్టర్

బాపట్ల, జనవరి 6 : ఓటర్ల నమోదు కోసం వచ్చిన అర్జీలను పారదర్శకంగా విచారణ చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల నమోదు కోసం వచ్చిన అర్జీల విచారణపై శనివారం కలెక్టర్ తనిఖీ చేశారు. బాపట్ల మండలానికి సంబంధించి ఓటర్ల నమోదు, తొలిగింపు, మార్పుల కోసం వచ్చిన అర్జీలను ఎలా పరిష్కరించారు అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో గంధం రవీందర్, మున్సిపల్ కమీషనర్ ఎ.భానుప్రతాప్, తహసీల్దార్ సుధారాణి పాల్గొన్నారు.



ఓటర్ల నమోదు కోసం వచ్చిన అర్జీలపై విచారణ చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

## రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం : మోపిదేవి

రేపల్లె, జనవరి 6 : రాష్ట్రాభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడేది జగన్మోహన్‌రెడ్డియేనని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. నగరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు 90శాతం పూర్తి చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. రేపల్లె నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్, ఎంపీపీ శ్రీకృష్ణయ్య, చందోలు దేవదాసు పాల్గొన్నారు.



పెంచిన పింఛన్‌లను అందిస్తున్న ఎంపీ మోపిదేవి, వైసీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్

## వైసీపీ మాటల ప్రభుత్వమే : సాయిబాబా

భట్టిప్రోలు, జనవరి 6 : వైసీపీ మాటల ప్రభుత్వమే కాని చేతల ప్రభుత్వం కాదని, మంత్రి నాగార్జున నియోజకవర్గ అభివృద్ధిలో విఫలం చెందారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆరోపించారు. స్థానిక గ్రామపార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022 డిసెంబరు 22న చుండూరులో జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్‌రెడ్డి వేమూరు నియోజకవర్గంపై వరాల జల్లు కురిపించారన్నారు. ఉప్పునీటి సమస్య నుంచి వాణిజ్య పంటలను కాపాడటానికి ఓలేరు పల్లెపాలెం వద్ద బ్యారేజీ నిర్మాణానికి రూ.2,500 కోట్లు కేటాయించగా నిధులు మంజూరు చేసి ఏప్రిల్ నెలలో టెండర్లు ఖరారు చేసి పనులు మొదలుపెడతామంటూ ప్రకటించారన్నారు. చేసిన ప్రకటన ఆచరణను మంత్రి నాగార్జున ఎంతవరకు తెచ్చారని ప్రశ్నించారు. జంపని షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల సమస్యలు, ఏపీ గ్రామంలో రోడ్ల నిర్మాణం చేశారో ఎంత నిధులు వచ్చాయో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, కనపర్తి సుందరరావు, బట్టు మల్లికార్జునరావు, యడ్ల జయశీలరావు, ఆదిన బసవపున్నయ్య, గొట్టుముక్కల లెనిన్, శ్రీనివాసరావు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

బాపట్లటౌన్, జనవరి 6 : ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్-1, 2 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. పట్టణంలో పోటీపరీక్షలకు శిక్షణ అందజేసే గోడపత్రికను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల నిరుద్యోగ అభ్యర్థులు భావపురి విద్యాసంస్థలలో ఈనెల 8వ తేదీ నుంచి 50 రోజులు పాటు పోటీ పరీక్షల ఉచిత శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో భావపురి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఆర్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ అభివృద్ధి ప్రణాళికపై అధికారులకు శిక్షణ

బాపట్ల, జనవరి 6 : బాపట్ల విస్తరణ శిక్షణా కేంద్రంలో అభివృద్ధి ప్రణాళికపై అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాలకు చెందిన జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారులు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలు, డీఎల్‌పీవోలు, డీఎల్‌సీవోలు, డీపీఆర్‌సీ రీసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక ఆవశ్యకత, వివిధ స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఎం.సుధాకరరావు, కేశవరెడ్డి, శిక్షణా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం జగన్‌ను ఇంటికి పంపటం ఖాయం

● ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న రమాదేవి

బాపట్ల, జనవరి 6 : ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ 26 రోజులుగా సమ్మె చేస్తున్నా స్పందించని జగన్మోహనరెడ్డిని ఇంటికి పంపటం ఖాయమని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి స్పష్టం చేశారు. బాపట్లలోని ఉప్పరపాలెం రోడ్డుపై శనివారం 24 గంటల రిలే నిరాహారదీక్షలను అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రారంభించారు. యూటీఎఫ్ మాజీ నాయకురాలు స్వరూపరాణి దీక్షలను లాంఛనంగా ప్రారంభించారు. రమాదేవి మాట్లాడుతూ రిలేనిరాహారదీక్షలు ఆమరణ నిరాహార దీక్షలకు వెళ్ళకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రేఖా ఎలిజబెత్ మాట్లాడుతూ ఆమరణ నిరాహారదీక్ష చేయటానికైన తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, నాయకులు జె.శామ్యూల్, శరత్, వై.భాస్కరరావు, ఎన్.కోటేశ్వరరావు, తిరుమలరెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వెలగా శైలశ్రీ, సీతామహాలక్ష్మి, శ్రీలత, పద్మ, పార్వతి, భారతి పాల్గొన్నారు. అంగన్‌వాడీలు మొదటిరోజు దీక్షలో శారద (అద్దంకి), హేమమాలిని (బాపట్ల), రేఖా ఎలిజబెత్(వేటపాలెం), ఝాన్సీ (రేపల్లె), మమత (అమర్తలూరు) కూర్చొన్నారు. వీరికి సంఘీభావంగా అనేక సంఘాలు మద్దతు తెలిపాయి.

● భట్టిప్రోలు, జనవరి 6 : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరవధిక సమ్మె శనివారం 26వ రోజుకు చేరింది. ఎస్మాకు లొంగేదిలేదని తాటాకు చప్పుళ్ళకు భయపడేదిలేదని ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని దీక్షా శిబిరంలోనే నిద్రిస్తూ నిరసనను తెలిపారు. సీఐటీయు మండల కార్యదర్శి జి.సుధాకర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు సేవలందిస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడం చేతకాక ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమన్నారు. ఆయా ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు, యూనియన్ మండల అధ్యక్షురాలు బి.రమాదేవి, సెక్టార్ లీడర్లు గృహలక్ష్మి, సూర్యలక్ష్మి, భద్రకాళీ పాల్గొన్నారు.

● కొల్లూరు, జనవరి 6 : గత 26 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెను కళ్లుండి కూడా ఈ గుడ్డి ప్రభుత్వం చూడలేకపోవడం దురదృష్టకరమని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె కళ్లుండి కూడా ప్రభుత్వం చూడలేకపోవడం విచారకరమని ఇకనైనా కళ్ల తెరిచి తమ న్యాయమైన కోర్కెల సాధన దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు బి.సుబ్బారావు, కార్యకర్తలు ఆదిలక్ష్మి, వనజ, భాగ్యం, సౌభాగ్యలక్ష్మి, బాల, అపర్ణ, అరుణ, సత్యవతి పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటం పెట్టి జీవో కాపీలను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

● రేపల్లె, జనవరి 6 : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోతే ఈ ప్రభుత్వాన్ని ఇంటిదోవ పట్టించాలని అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జి.నాగమల్లేశ్వరమ్మ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం గేటు వద్ద అంగన్‌వాడీలు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె శనివారం 26వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు తొక్కుడు బిళ్ళ ఆడుతూ నిరసన తెలిపారు. జీతాలు ఇవ్వటానికి డబ్బులు లేవని చెప్పే ప్రభుత్వం ముఖ్యమంత్రి గెస్ట్‌హౌస్ కోసం రూ.450 కోట్లు ఏవిధంగా ఖర్చు పెడుతుందని ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో వై.కనకదుర్గ, ఝాన్సీ, మణి, సబీనా, మాదవి, మేరాబీ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

● అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించటం సిగ్గు చేటని సిఐటియూ బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ అన్నారు. శనివారం అంగన్‌వాడీలు, సీఐటియూ నాయకులు చేస్తున్న నిరవధిక సమ్మె 26వరోజుకు చేరింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటం పెట్టి ఎస్మా ప్రయోగించిన జీవో కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఎస్మా చట్టం పరిధిలో అంగన్‌వాడీలను చేర్చి బెదిరించటాన్ని ప్రజాస్వామ్యవాదులు, కార్మిక సంఘాలు ముక్తకంఠంతో ఖండించాయి. ఈ కార్యక్రమంలో రేపల్లె ప్రాజెక్టు కార్యదర్శి కె.వాణి, బి.జ్యోతి, వై.మేరీమణి, నిర్మలాజ్యోతి, శ్రీలత, పార్వతి, రజని, కేవీ లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రశిక్ష ఉద్యోగుల బైక్ ర్యాలీ

బాపట్ల, జనవరి 6 : సమస్యల పరిష్కారం కోసం సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారం 18వ రోజుకు చేరుకుంది. రాష్ట్రకమిటీ పిలుపుమేరకు ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్స్‌ను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం బెదిరింపులకు పోకుండా చర్చలకు పిలిచి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తామంతా ఉన్నత చదువులు చదువుకున్నామని తమ సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో టి.మాణిక్యారావు, రాజేష్, సుధారాణి, అబ్రహం, సుజాత, అంజనాదేవి, నాగమణి, నాగరాజు పాల్గొన్నారు.

# దిక్సూచి
DIKSUCHI

## విదేశాల్లో చదవాలా..
# ఈ పరీక్షలు రాయండి

విదేశాల్లో చదువుకోవాలంటే కేవలం అకడమిక్ అర్హతలు ఉంటే సరిపోదు. చదివే కోర్సును బట్టి కొన్ని, కామన్‌గా మరికొన్ని ఎంట్రెన్స్ టెస్టులు ఉంటాయి. ఆ టెస్టులతో అవసరం లేదని చెప్పే విదేశీ వర్సిటీలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ వీటిని రాయడమే మేలు. వీటిలో సాధించిన స్కోర్‌తో పెట్టుకునే దరఖాస్తు పటిష్ఠంగా ఉంటుంది. అంతేకాదు, కాలేజీ క్రెడిట్స్ లభిస్తాయి. స్కాలర్‌షిప్‌లకు అర్హత సాధించేందుకు కూడా దోహదపడతాయి. అవేంటంటే....



భారత దేశానికి వెలుపల అంటే మొదట రాయాల్సింది ఇంగ్లీష్ టెస్ట్. ఈ టెస్టులో సాధారణంగా నాలుగు మాడ్యూల్స్ - లిజనింగ్, రీడింగ్, రైటింగ్, స్పీకింగ్ ఉంటాయి. ఈ టెస్టులు అభ్యర్థికి ఇంగ్లీష్‌లో ఉన్న ప్రావీణ్యాన్ని పరీక్షిస్తాయి. ఇంగ్లీష్ మాట్లాడే దేశాల్లో చదివేందుకు ఈ టెస్టులు ఉపయోగపడతాయి. ఐఈఎల్‌టీఎస్ అకడమిక్, ఐఈఎల్‌టీఎస్ యూకేవిఐ, టీఓఈఎఫ్ఎల్ ఐబీటీ, డీయూఓ ఎల్ఐఎన్‌జీఓ, పియర్సన్ ఈ ఇంగ్లీష్ టెస్టుల్లో ముఖ్యమైనవని చెప్పవచ్చు.చాలా దేశాలు ఈ టెస్టుల్లో సాధించిన స్కోర్‌ను ఆమోదిస్తాయి. అయితే బ్రిటన్‌లో మాత్రం ఐఈఎల్‌టీఎస్‌లో సాధించిన మార్కులకు అధిక ప్రాధాన్యం ఇస్తారు.

### అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్

- **ఎల్ఎన్ఏటి:** యూకేలో లా కోర్సు చేసేందుకు www.lnat.ac.uk ఈ టెస్ట్ రాయాలి. యూకె వర్సిటీల కన్సార్షియం దీన్ని డెవలప్ చేసింది. యూజీ స్థాయిలో లా చదివేందుకు అభ్యర్థికి ఉన్న సామర్థ్యాలను పరీక్షిస్తుంది. అభ్యర్థి ఆప్టిట్యూడ్, వెర్బల్ రీజనింగ్, కాంప్రహెన్షన్, ఇంట్రప్రెటేషన్, అనాలిసిస్, సింథసిస్, ఇండక్షన్, డిడక్షన్ టెస్టులో భాగం.
- **ఎల్ఎస్ఏటీ:** అమెరికా, కెనడా దేశాల్లో లా చేసేందుకు ఈ టెస్ట్ www.lsac.org/lsat అవసరం. ఇదో ప్రామాణికమైన లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్. అభ్యర్థి లాజికల్, వెర్బల్ రీజనింగ్ నైపుణ్యాలను పరీక్షిస్తుంది.
- **ఎస్ఏటీ, ఎస్ఏటీ సబ్జెక్టు టెస్టులు:** అమెరికా, కెనడా, సింగపూర్‌లో చదువులకు www.collegeboard. com ఎస్ఏటీ ఉపయోగపడుతుంది. వెర్బల్, మేథమెటికల్, రైటింగ్ నైపుణ్యాలను ఈ టెస్ట్‌లో పరీక్షిస్తారు. ప్రత్యేకించి ఒక సబ్జెక్ట్ ఏరియాలో ప్రావీణ్యాన్ని తెలియజెప్పేవి ఎస్ఏటీ సబ్జెక్టు టెస్టులు.
- **ఏపీ టెస్ట్స్ ఫర్ యుఎస్:** కాలేజీ క్రెడిట్స్ సాధించేందుకు దారితీసే అడ్వాన్స్‌డ్ ప్లేస్‌మెంట్స్ ఎగ్జామ్స్ www.collegeboard.com ఇవి.
- ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జికి కూడా సొంతంగా ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ www.admissiontesting.org ఉన్నాయి. యూక్యాట్(గతంలో యుకెక్యాట్ అనేవారు) ప్రత్యేకించి యూకేలో మెడికల్ స్కూల్స్‌లో చేరేందుకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్ష. యూకేలో బయో మెడికల్ సైన్సెస్‌లో చేరేందుకు బీఎంఏటీ, మేథమెటిక్స్ అలాగే ఎకనామిక్స్‌లో చేరేందుకు టీఎంయూఏ ఇప్పటి వరకు అవసరం. ఈ ఏడాది వీటిని తీసేయవచ్చు.

### టెస్ట్స్ ఫర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్

- అమెరికా, కెనడా, యూరప్, సింగపూర్‌లో ఇంజనీరింగ్, సైన్స్ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకు ఉద్దేశించిన టెస్ట్ జీఆర్ఈ. గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్‌గా దీనికి ప్రపంచవ్యాప్తంగా పేరుంది. వెర్బల్, క్వాంటిటేటివ్, అనలిటికల్ రైటింగ్ స్కిల్స్‌ను ఇందులో పరీక్షిస్తారు.
- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో చేరేందుకు జీమ్యాట్ www.mba.com రాయాలి. గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ కాగా కంప్యూటర్ అడాప్టివ్ టెస్ట్ ఇది. రీజనింగ్, క్రిటికల్ థింకింగ్, అనలిటికల్, క్వాంటిటేటివ్, వెర్బల్ స్కిల్స్‌ను ఈ టెస్టులో పరీక్షిస్తారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లోని విద్యాసంస్థల్లో ఎంబీఏ చేసేందుకు ఈ టెస్ట్‌లో తెచ్చుకున్న స్కోర్ ప్రాతిపదిక అవుతుంది.
- జీఏఎంఎస్ఏటీ - యూకే, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, సింగపూర్, ఐర్లాండ్‌లో గ్రాడ్యుయేట్ మెడికల్ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకు www.ga-msat.acer.org ఈ టెస్ట్ రాయాలి. ఇది కూడా కంప్యూటర్ ఆధారిత ప్రామాణిక పరీక్ష. మెడిసిన్, డెంటిస్ట్రీ, ఆప్టోమెట్రీ, ఫార్మసీ, వెటర్నరీ సైన్సెస్‌లో చేరేందుకు దీన్ని ఉద్దేశించారు.
- ఎంక్యాట్ మరో టెస్ట్. యుఎస్, కెనడాలో మెడికల్ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకు దీన్ని www.aa-mc.org నిర్వహిస్తున్నారు.ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ప్రాబ్లెమ్ - సాల్వింగ్, క్రిటికల్ థిం కింగ్, రిటెన్ అనాలిసిస్, సైంటిఫిక్ ప్రిన్సిపల్స్ అలా గే కాన్సెప్ట్‌పై పరిజ్ఞానాన్ని ఈ టెస్ట్‌లో పరీక్షిస్తారు.

## విశాఖ ఐఐఎంలో పీజీపీ

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంవీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(పీజీపీ)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఎంబీఏ డిగ్రీకి సమానం. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 340 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ, క్యాట్ 2023 స్కోర్, అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటింగ్, కంపెనీ సెక్రటరీషిప్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 8 నుంచి 30 వరకు
- **అడ్మిషన్స్:** మే 20
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** జూన్ 24
- **వెబ్‌సైట్:** iimv.ac.in

### 19 నుంచి హైదరాబాద్ ఐఐటీలో
## ఆర్ అండ్ డి ఇన్నోవేషన్ ఫెయిర్

హైదరాబాద్ ఐఐటీలో ఈ నెల 19, 20 తేదీల్లో ఆర్ అండ్ డి ఇన్నోవేషన్ ఫెయిర్‌ని నిర్వహిస్తున్నారు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దీన్ని ప్రారంభిస్తారు. దేశంలోని ఐఐటీలకు తోడు ఎన్ఐటి, ఐఐఎస్ఈఆర్, ఐఐఎస్సీ బెంగళూరు అలాగే 50 వరకు టాప్ ర్యాంక్‌లో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలు ఈ ఫెయిర్‌లో పాల్గొననున్నాయి. ఇండస్ట్రీ నుంచి రెండు వేలమంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ ప్రాతిపదికగా ఈ ఫెయిర్ ఉంటుంది.

**వెబ్‌సైట్స్:** https://www.iith.ac.in/, https://www.iith.ac.in/.

## నేషనల్ లా స్కూల్‌లో పీజీ, పీహెచ్‌డీ

బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్ఐయూ) - ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఎంపీపీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అడ్మిషన్ టెస్ట్‌ల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

### ఎల్ఎల్‌బీ ఆనర్స్

ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీని వ్యవధి మూడేళ్లు. ఏడాదికి మూడు చొప్పున మొత్తం తొమ్మిది ట్రైమెస్టర్లు ఉంటాయి. ఏడాదికి 48 చొప్పున మొత్తం 144 క్రెడిట్స్ సాధించాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో 120 సీట్లు ఉన్నాయి. సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించే నేషనల్ లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్(ఎన్ఎల్ఎస్ఏటీ-ఎల్ఎల్‌బీ) 2024 ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వీరు 2024 డిసెంబరు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

### మాస్టర్స్ ఇన్ పబ్లిక్ పాలసీ (ఎంపీపీ)

ఇది రెండేళ్ల వ్యవధిగల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఏడాదికి మూడు చొప్పున మొత్తం ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో పబ్లిక్ పాలసీ, ఎకనామిక్స్, లా, సోషియాలజీ, ఫైనాన్స్, ఇండియన్ సొసైటీ, పొలిటికల్ ఎకానమీ అంశాలు ప్రధానంగా ఉంటాయి.

### పీహెచ్‌డీ

- ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. లా, ఇంటర్‌డిసిప్లినరీ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 4 చొప్పున మొత్తం 8 సీట్లు ఉన్నాయి. సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ పీహెచ్‌డీ(ఎన్ఎల్ఎస్ఏటీ-పీహెచ్‌డీ)2024, రీసెర్చ్ ప్రపోజల్, ఓరల్ ప్రజంటేషన్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 24
- **ఎన్ఎల్ఎస్ఏటీ 2024 తేదీ:** మార్చి 17
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.nls.ac.in

**'దిక్సూచి' వెబ్ పేజీలో..**
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/oRGAhebలో చదవండి.

### ఐఐఎఫ్ఎంలో
## పీజీ డిప్లొమాలు

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్(ఐఐఎఫ్ఎం) - పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫారెస్ట్రీ మేనేజ్‌మెంట్(పీజీడీఎఫ్ఎం), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ సస్టయినబిలిటీ మేనేజ్‌మెంట్(పీజీడీఎస్ఎం) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఇవి రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. పీజీడీఎఫ్ఎంలో 150 సీట్లు, పీజీడీఎస్ఎంలో 75 సీట్లు ఉన్నాయి. జాతీయ పరీక్ష స్కోర్, అకడమిక్ ప్రతిభ, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఇంటర్వ్యూ కేంద్రాలు:** అహ్మదాబాద్, భోపాల్, ఢిల్లీ, గువహటి, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 15
- **వెబ్‌సైట్:** www.iifm.ac.in

# ఇక రాజులమ్మ జాతరే



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తండేల్'. శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. 'తండేల్' కథను క్లుప్తంగా పరిచయం చేస్తూ శనివారం చిత్రబృందం ప్రత్యేక వీడియోను వదిలింది. మత్స్యకార పాత్రలో నాగచైతన్య కనిపించనున్నారు. 'ఈ పాలి యేట...గురి తప్పేదేలేదేస్... ఇక రాజులమ్మ జాతరే' అంటూ ఆయన శ్రీకాకుళం యాసలో పలికిన మాస్ డైలాగ్‌తో వీడియో మొదలైంది. చేపలు పడుతూ పాకిస్తాన్ జలాల్లోకి ప్రవేశించడం, అక్కడి సైన్యం వారిని కరాచీ సెంట్రల్ జైలులో ఖైదు చేసి చిత్రహింసలు పెట్టడం సినిమాపై ఆసక్తిని పెంచాయి. నాగచైతన్య ప్రేయసి బుజ్జి తల్లిగా సాయిపల్లవి కనిపించారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# మారేడుమిల్లిలో యాక్షన్



వరుస విజయాలతో దూసుకుపోతున్నారు నందమూరి బాలకృష్ణ. ఇప్పటికే అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్‌కేసరి చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టిన బాలయ్య సిక్సర్‌పై కన్నేశారు. ఆ ప్రయత్నంలో భాగంగా కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో ఎస్.నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం తాజా షెడ్యూల్ మారేడుమిల్లి ఫారెస్ట్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో బాలకృష్ణ, ప్రధాన తారాగణంపై యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు బాబీ చిత్రీకరిస్తున్నారు. సీనియర్ నటి ఊర్వశి కూడా షూటింగ్‌లో భాగమయ్యారు. మరో రెండు మూడు రోజుల్లో ఈ షెడ్యూల్ పూర్తి కానున్నట్టు మేకర్స్ తెలిపారు. బాలకృష్ణ కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని భిన్నమైన పాత్రను ఇందులో చేస్తున్నారని, కథ, కథనం, సినేరియా కొత్తగా ఉంటుందని, అభిమానులు పండుగ చేసుకునేలా బాలకృష్ణ కేరక్టరైజేషన్ ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. బాబీడియోల్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ మీనన్ కూడా ప్రత్యేక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.

# ప్రేక్షకులకు చాలా సర్ప్రైజ్‌లు ఉన్నాయి

**- విజయ్ బిన్ని**



'తొలి సినిమాలోనే నాగార్జున గారి లాంటి పెద్దస్టార్‌ని డైరెక్ట్ చేయడం నా అదృష్టం. 1980ల్లో సాగే కథ కావడంతో 'నా సామిరంగ' చిత్రంలో ఆయన్ను డిఫరెంట్‌గా, కొత్తగా చూపించబోతున్నాం. అభిమానులకు పాత చిత్రాల్లో నాగార్జున గుర్తుకొస్తారు' అని దర్శకుడు విజయ్ బిన్ని చెప్పారు. శ్రీనివాస చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విజయ్ బిన్ని సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- దర్శకుడు కావాలనే లక్ష్యంతో పరిశ్రమకు వచ్చాను. ఆ విభాగంలో రాణించడానికి ఉపయోగపడుతుందని నృత్య దర్శకుడిగా మారాను. అలా నాగార్జున గారి సినిమాలకు కొరియోగ్రఫీ చేయడం వల్ల ఆయనతో పరిచయం ఏర్పడింది. నాగార్జున గారికి ఒక కథ వినిపించాను. ఆయన 'నా సామిరంగ' సినిమా చేయమని అవకాశం ఇచ్చారు. కథను ఆకళింపు చేసుకొని నాదైన శైలిలో తెరకెక్కించాను. సినిమా అవుట్‌పుట్ పట్ల ఆయన సంతోషంగా ఉన్నారు. నాగార్జున గారి సహకారంతో ఇబ్బందిపడకుండా సజావుగా, వేగంగా చిత్రీకరణ పూర్తి చేశాం.
- స్నేహం, ప్రేమ, భావోద్వేగాల సంఘర్షణ నేపథ్యంలో కథ సాగుతుంది. నాగార్జున గారి స్నేహితుడిగా అల్లరి నరేశ్ కనిపిస్తారు. రాజ్‌తరుణ్‌ది కీలకమైన పాత్ర. మూడు పాత్రల మధ్య ఉన్న సంబంధం, వారికెదురైన సవాళ్లు, వారు ఎలా స్పందించారు అనేది ఆసక్తికరంగా చూపించబోతున్నాం. 'నా సామిరంగ'లో ప్రేక్షకులకు చాలా సర్ప్రైజ్‌లు ఉన్నాయి. అవేంటో తెరపైన చూస్తేనే బాగుంటుంది. కీరవాణి గారు స్వరపరిచిన మూడు పాటలూ సూపర్‌హిట్టయ్యాయి.

# నటుడిగా సైంధవ్ సంతృప్తిని ఇచ్చింది

**- నవాజుద్దీన్ సిద్దిఖీ**



'తెలుగు సినిమా చేయాలని చాలాకాలంగా అనుకుంటున్నాను. సరైన కథ కుదరడంతో 'సైంధవ్'తో అరంగేట్రం చేస్తున్నాను. వెంకటేశ్‌తో పనిచేయడం ఎవరికైనా ఒక డ్రీం. ఆయనతో పనిచేసినందుకు ఆనందంగా ఉంది' అని నవాజుద్దీన్ సిద్దిఖీ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రమిది. నవాజుద్దీన్ విలన్‌గా నటించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు.

- కొన్నిసార్లు నెగిటివ్ పాత్రల్లోనే నటనకు ఎక్కువ ఆస్కారముంటుంది. పాత్ర ఆసక్తికరంగా ఉంటే హీరోనా, విలనా అనేది పట్టించుకోను. ఇందులో నా పాత్రను శైలేష్ కొత్త తరహాలో తీర్చిదిద్దారు. నటుడిగా ఈ సినిమా చాలా సంతృప్తిని ఇచ్చింది. నా పాత్రకు ఇతరులు ఎవరో డబ్బింగ్ చెప్పడం నాకు ఇష్టం ఉండదు. భాషను భావాన్ని అర్థం చేసుకొని తెలుగులో డబ్బింగ్ చెప్పాను. ప్రతి డైలాగ్‌ను బాగా సాధన చేశాను. కష్టంతో కూడిన యాక్షన్ సీక్వెన్స్ చేయడం సవాల్‌గా అనిపించింది. సముద్రంలో బోట్‌పై యాక్షన్ సీక్వెన్స్‌లు చేస్తున్నప్పుడు భారీ అల వచ్చి నన్ను పైకి లేపింది. పై ప్రాణాలు పైనే పోయాయి. అదృష్టవశాత్తూ మళ్లీ బోట్‌లోనే పడ్డాను.
- సెట్‌లో వెంకటేశ్ చాలా ప్రశాంతంగా ఉంటారు. డైలాగ్స్ బాగా సాధన చేసి షూటింగ్‌కి వస్తారు. రిస్క్‌తో కూడిన యాక్షన్ సీన్స్ చేశారు. ఆయన నుంచి సహనం నేర్చుకోవాలి. వెంకటేశ్‌ను ఈ చిత్రంలో సరికొత్తగా చూడబోతున్నారు. శైలేష్ ప్రొఫెషనల్ డైరెక్టర్. కథకు మెరుగులు అద్దడంలో దిట్ట. కథను చెప్పినంత అద్భుతంగా సినిమాను మలిచాడు. టాలీవుడ్ పరిశ్రమ సమయపాలనకు చాలా ప్రాధాన్యం ఇస్తుంది. ఇక్కడి దర్శకులు, నటులతో పనిచేయాలనుంది. అవకాశం వస్తే ఓషో బయోపిక్ చేయాలనేది నా కోరిక.

# వినోదంతో గీతాంజలి వస్తోంది



'నా తొలి హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రం 'గీతాంజలి' ఘన విజయం సాధించింది. ఇప్పుడు 'గీతాంజలి మళ్లీ వచ్చింది' సీక్వెల్‌తో ప్రేక్షకుల ముందుకొస్తున్నాం. సినిమా చాలా బాగుంది. క్లైమాక్స్ ఊహకందని స్థాయిలో ఉంటుంది' అని అంజలి అన్నారు. ఆమె టైటిల్ పాత్రలో నటించిన చిత్రమిది. శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవీవీ సత్యనారాయణ నిర్మించారు. కోన వెంకట్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు. శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేశ్, అలీ, సునీల్ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం చిత్రబృందం ఈ సినిమాలోని పాత్రల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ 'ఈ చిత్రంలో గీతాంజలి ముద్దుగా కనిపించినా తను చేసే పనులు భయపెడతాయి. కోన గారు సృష్టించిన కామెడీ ట్రాక్, కథను మలిచిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "గీతాంజలి" సీక్వెల్‌కు అవకాశం ఇచ్చిన కోన వెంకట్ గారికి ధన్యవాదాలు. అంజలి, శ్రీనివాస్‌రెడ్డి సహకారం మరిచిపోలేను' అని తెలిపారు. కోన వెంకట్ మాట్లాడుతూ 'కమర్షియల్ సినిమాలకు భిన్నంగా వెళ్లాలనే కోరికతో 'గీతాంజలి' తీశాం. సీక్వెల్ ప్రేక్షకులు అంచనాలకు మించి ఆస్వాదించేలా ఉంటుంది. సంక్రాంతికి టీజర్‌ను విడుదల చేస్తాం' అన్నారు. నవ్విస్తూ, భయపెడుతూ వినోదం పంచే చిత్రమిదని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

# రొమాంటిక్ ఎంటర్టైనర్



నారా రోహిత్ కథానాయకుడిగా నూతన చిత్రం ప్రారంభమైంది. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్‌రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. 'నారా రోహిత్ 20' వర్కింగ్ టైటిల్. శనివారం చిత్రీకరణ ప్రారంభమైంది. తొలిషాట్‌కు సినిమాటోగ్రాఫర్ ప్రదీప్ ఎం వర్మ కెమెరా స్విచ్చాన్ చేశారు. గౌతమ్‌రెడ్డి క్లాప్ ఇచ్చారు. విజయ్ కృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. వీర్తి వాఘని కథానాయిక. శ్రీదేవి విజయ్‌కుమార్, వీకే నరేశ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. లియోన్‌జేమ్స్ సంగీతం అందిస్తున్నారు.

# థ్రిల్లింగ్ అంశాలతో ముఖ్య గమనిక



విరాన్ ముత్తంశెట్టి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ముఖ్య గమనిక'. సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్ తొలిసారి దర్శకత్వం వహిస్తున్నారు. లావణ్య కథానాయిక. రాజశేఖర్, సాయికృష్ణ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. దర్శకుడు మారుతి టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన చిత్రమిది. విరాన్ కానిస్టేబుల్‌గా నటించాడు. కథ ఆసక్తికరంగా ఉంది. సినిమా సూపర్‌హిట్ అవ్వాలి' అని ఆకాంక్షించారు. విరాన్ మాట్లాడుతూ 'వేణు గారితో పనిచేయడం ఆనందంగా ఉంది. ఫిబ్రవరిలో చిత్రాన్ని విడుదల చేయనున్నాం' అని తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'థ్రిల్లింగ్ అంశాలతో సాగే ఫ్యామిలీ ఎమోషన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కించాం. మంచి కథతో వస్తున్నాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. నిర్మాత మాట్లాడుతూ 'మా శివిన్ ప్రొడక్షన్‌లో రూపొందుతున్న తొలి చిత్రమిది. ఇప్పటికే విడుదలైన పాటలకు చక్కటి ఆదరణ వచ్చింది' అనిచెప్పారు.

## దళితుల భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

అద్దంకి, డిసెంబరు 6: పూర్వీకుల నుంచి సంక్రమించిన పొలం, స్థలాలను ఆక్రమించిన అగ్రకులాలకు చెందిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్‌మాదిగ అన్నారు. అద్దంకి మండలంలోని కలవకూరులో యరజాని సాగర్ కుటుంబ సభ్యులకు పూర్వీకుల నుంచి వచ్చిన పొలం, స్థలాలను అగ్రకులాలకు చెందిన ప్రశాంత్‌రెడ్డి, ఆదిరెడ్డి, నాగేశ్వరరెడ్డి ఆక్రమించి రానీయకుండా అడ్డుకుంటున్నారని తహసీల్దార్ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. పొలంలోకి రానీయకుండా అడ్డుకుంటున్నారని, కులం పేరుతో దూషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని కూడా బినామీ పేరుతో కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు, దుడ్డు వినోద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు రెండు గ్రామాల నేతలతో ఎమ్మెల్యే రవికుమార్ సమీక్ష

బల్లికురవ, జనవరి 6: మండలంలోని కూకట్లపల్లి, వైదన గ్రామాలకు చెందిన టీడీపీ నేతలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ఉదయం 11 గంటలకు సంతమాగులూరు అడ్డరోడ్డు వద్ద గల క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి రెండు గ్రామాలకు చెందిన నేతలు, బూత్ కమిటీ సభ్యులు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం కోరింది.

పంగులూరు: పంగులూరు మండలం అలవలపాడు గ్రామ టీడీపీ నేతలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జొన్నతాళిలోని క్యాంప్ కార్యాలయంలో ఈ సమీక్ష నిర్వహిస్తారని కార్యాలయ ప్రతినిధి తెలిపారు. సమావేశానికి నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఏజంట్లు, పేజీ నేస్తం సభ్యులు హాజరుకావాలని కోరారు.

## నేడు సినీ నటుడు తనికెళ్ళకు జీవిత సాఫల్య పురస్కారం

అద్దంకిటౌన్, జనవరి 6: పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో సినీనటుడు తనికెళ్ల భరణికి పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ జీవిత సాఫల్య పురష్కారం అందజేయనున్నట్టు నిర్వాహకులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. శనివారం రోటరీ కార్యాలయంలో పురస్కారానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వారణాసి రఘురామశర్మ, డాక్టర్ యు.దేవపాలన, డీవీఎం సత్యానారాయణ, మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీ రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 'బత్తుల' ఆశయ సాధనకు కృషిచేయాలి

పంగులూరు, జనవరి 6: సమసమాజం కోరుతూ దశాబ్దాలపాటు ఉద్యమించిన పీడీఎం నేత బత్తుల మోహనరావు ఆశయసాధన కోసం పోరాటం కొనసాగించాలని విరసం నేత కల్యాణరావు అన్నారు. శనివారం మండలంలోని బైటమంజులూరు గ్రామంలో పీడీఎం ఉమ్మడి ప్రకాశం జిల్లా గౌరవాధ్యక్షుడు బత్తుల మోహనరావు సంస్మరణ సభకు రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటేష్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ అనేక కుట్ర కేసులు ఎదుర్కొని జీవితాంతం ప్రజా ఉద్యమాలతో ప్రయాణం సాగించిన మోహనరావు స్ఫూర్తిని కొనసాగిద్దామన్నారు. కార్యక్రమంలో జె.కోటి, మాచర్ల మోహనరావు, సుధాకర్, బొప్పూడి అంజమ్మ, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# 'కొమ్మమూరు'కు సాగునీరు విడుదల

- బెట్టకొచ్చిన వరి
- తడులకు అవకాశం
- ఊపిరి పీల్చుకుంటున్న రైతులు


కొమ్మమూరు కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న రైతులు

చీరాల, జనవరి 6: కొమ్మమూరు కాలువకు సాగునీరు విడుదల చేశారు. ఆయకట్టు పరిధిలో ఈఏడాది ఖరీఫ్‌లో మాగాణి భూముల్లో నాట్లు వేశారు. ఆతరువాత నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో ఆయకట్టు పరిధిలో మాగాణి సాగుచేయవద్దని అధికారులు చెప్పారు. కొద్ది రోజులు వారబందీ ప్రకారం సాగునీరు అందిస్తామని, అతరువాత సాగునీరు ఏమాత్రం ఇవ్వలేమని తెలిపారు. మాగాణికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అయితే, అప్పటికే కారంచేడు, చీరాల, వేటపాలెం, నాగులుప్పలపాడు మండలాల్లో ఖరీఫ్ చివర, రబీ తొలినాళ్లలో నాట్లు వేశారు. చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో ఎత్తిపోతల పథకాల కింద మాగాణి చేశారు. ఆ తరువాత వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.

ఇటీవల తుఫాన్ నేపథ్యంలో కురిసిన వర్షాలు తప్ప మాగాణి పైరుకు తడి అనేది లేకుండా పోయింది. ప్రస్తుతం సాగులో ఉన్న వరి చేలు పొట్ట దశలో ఉన్నాయి. కొన్నిచోట్ల కంకులు ఈనుతున్నాయి. ఈదశలో పైరుకు సాగునీరు అత్యంత అవసరం. కొమ్మమూరు కాలువలో సాగునీరు సక్రమంగా లేకపోవటంతో తడి ఇవ్వలేకపోయారు. దీంతో మాగాణి చేలు బీటలు వారాయి. ఈక్రమంలో పలు గ్రామాల రైతులు మాగాణికి ప్రస్తుతం తడి ఇచ్చేందుకు అవసరమైన సాగునీరు విడుదలచేయించి తమను ఆదుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తికి విజ్ఞప్తి చేశారు.

ఈనేపథ్యంలో ఎమ్మెల్యే బలరాం సాగునీటి పారుదలశాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డితో నాలుగు రోజుల క్రితం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం పైరు పొట్ట దశలో ఉండటంతో, నీటి తడి ఆవశ్యకతను ఈఎన్‌సీకి వివరించారు. సాగునీరు అందించలేమని చెప్పినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో సాగులో ఉన్న మాగాణి పైరును కాపాడుకునేందుకు తడి ఇవ్వకుంటే జరిగే భారీ నష్టాన్ని, తద్వారా రైతులకు ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను చెప్పటంతో ఈ ఎన్‌సీ సానుకూలంగా స్పందించారు. బలరాం సూచనమేరకు తిమ్మసముద్రం సర్పంచ్ కరణం రమేష్‌బాబు, మరికొన్ని గ్రామాల రైతులు ఈఎన్‌సీని కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వినతిపత్రం అందజేశారు. దీంతో అధికారులు కొమ్మమూరు కాలువకు సాగునీటిని విడుదల చేశారు. శనివారం సాయంత్రానికి నర్సాయపాలెం లాకుల ప్రాంతానికి కొమ్మమూరు కాలువలో నీరు చేరింది. అక్కడనుంచి ఆది, సోమవారాల్లో కారంచేడు, చీరాల, వేటపాలెం, నాగులుప్పలపాడు మండలాల పరిధిలోకి సాగునీరు చేరనుంది. దీంతో తమ పైరును కాపాడుకునేందుకు ఆస్కారం లభించిందని సాగుదారులు పేర్కొంటున్నారు.

# వాగులో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట

- దిగువ భూములకు నీరందని పరిస్థితి
- పట్టించుకోని డ్రైనేజీ అధికారులు
- రైతుల ఆగ్రహం


పర్చూరు - కారంచేడు మధ్య వాగులో నీరు ముందుకెళ్లకుండా వేసిన అడ్డుకట్ట

పర్చూరు, జనవరి 6: నీటి కష్టాలు రోజురోజుకు రైతులను వెంటాడుతున్నాయి. నిన్నా మొన్నటి వరకు వరదలు, ఎల్లవలతో నీట మునిగిన పంట పొలాలు నేడు నీరులేక బీటలు వాలుతున్నాయి. ఈతరుణంలో సాగునీటి కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అసలే అరకొరగా ప్రవహిస్తున్న పర్చూరు వాగులో కొందరు నీటి ప్రవాహానికి అడ్డుగా కట్టలు వేయటంలో దిగువ రైతులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరదలు ముంచెత్తటంతో సర్వంకోల్పోయామని, ప్రస్తుతం మొక్కలు నాటుకుందామన్నా నీరు అందుబాటులోలేని దుస్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు. పర్చూరు - కారంచేడు మధ్యలో నీరు దిగువకు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో తాము పంటలను ఎలా సాగుచేసుకోవాలంటూ వాపోతున్నారు. వాగులో యథేచ్ఛగా కట్టఏర్పాటు చేసినా సంబంధిత డ్రైనేజీ అధికారులు పట్టించుకోకపోవటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కారంచేడు - పర్చూరు వాగు సమీప భూముల్లో వేల ఎకరాల్లో నీరులేక భూములు సాగుకు నోచుకోలేదు. ప్రస్తుతం సాగుకోసం భూములను సిద్ధం చేసుకున్న తరుణంలో ఉన్న నీటికి సాగుకోసం వినియోగించుకుందామన్న రైతులకు ఆడిఆశగా మారింది. వాగు మధ్యలో కట్ట ఏర్పాటుతో నీరు ముందుకు కదలని దుస్థితి ఏర్పడింది. దీంతో వేల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. వాగులో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తే దిగువ రైతుల పరిస్థితి ఏమిటంటూ కారంచేడు వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క కొమ్మమూరు కాలవలో నీరులేక వరి పంటలు ఎండిపోతున్నాయి. కనీసం మెట్ట భూముల్లో సాగుచేసుకుందామన్నా ఇలా వాగులో ఉన్న అరకొర నీటిని అందకుండా అడ్డకట్ట వేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వాగులో అడ్డుకట్ట వేసిన అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవటం దారుణమన్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుపోతానని వైస్ ఎంపీపీ స్పష్టంచేశారు.

# సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


మహిళకు టీడీపీ మినీ మేనిఫెస్టో పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, జనవరి 6: సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని చక్రాయపాలెం, శాంతినగర్‌లో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ మినీమేనిఫెస్టో గురించి వివరించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల ద్వారా అన్నివర్గాల ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ లభిస్తుందన్నారు. సీఎం జగన్‌రెడ్డి పాదయాత్రలో 730 హామీలు ఇచ్చారని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. వీటిల్లో 109 హామీలు మాత్రమే అమలు చేసి 85 శాతం హామీలు ఎగ్గొట్టారన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.10 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. నాలుగేళ్ళలో పేదల రక్తం పీల్చి దాదాపు రూ.2 లక్షల కోట్లు వివిధ రూపాలలో వసూలు చేశారన్నారు. ఒక్క సాగునీటి ప్రాజెక్టు నిర్మించి ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదన్నారు. పింఛన్ రూ.3వేలు చేస్తానని చెప్పి, చివరి మూడు నెలల్లో రూ.3 వేలు ఇవ్వటం మోసం చేయటం కాదా అని ఎమ్మెల్యే రవికుమార్ ప్రశ్నించారు. జగన్‌రెడ్డిని నమ్మి నష్టపోయిన పింఛన్‌దారులకు నష్టపోయిన సొమ్ము మొత్తం తిరిగి ఇవ్వాలన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ, జనసేన కూటమి గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, మానం మురళీమోహన్‌దాస్, పెంట్యాల రామాంజనేయులు, బండారు రాఘవ, పూనాటి విక్రమ్, గాలం వెంకటేశ్వర్లు, రాయుడు నరేంద్ర, గోగులమూడి రాజశేఖర్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన గ్రామం

అద్దంకిటౌన్, జనవరి 6: ధర్మవరం ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన గ్రామమని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన అన్నారు. జైనమత తీర్థంకరులు కూడా ఇక్కడ నుంచే మత ప్రచారం చేశారని చెప్పారు. శనివారం మండలంలోని ధర్మవరం జడ్పీహెచ్‌ఎస్‌లో విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన దర్మవరం చారిత్రక వైభవం పుస్తక పరిచయ కార్యక్రమానికి హెచ్‌ఎం శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఆదిమానవుల కాలం నుంచి నేటివరకు జరిగిన ధర్మవరం చరిత్ర, అద్దంకి శాసనం, కందుకూరు శాసనం వేయించిన పాండురంగని గురించి రచయిత జ్యోతి చంద్రమౌళి వివరించారు. విద్యార్థులు నాటి చరిత్రను కచ్చితంగా తెలుసుకోవాలని ఎంఈవో బూదాటి సుధాకరరావు అన్నారు. కార్యక్రమంలో ధర్మవరపు చారిటీస్ అధ్యక్షుడు హరిబాబు, శ్రీనివాసరావు, శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 36 మద్యం బాటిళ్లు స్వాధీనం

బల్లికురవ, జనవరి 6: మండలంలోని వేమవరంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న ఓవ్యక్తి ఇంటిలో తనిఖీలు చేయగా 36 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని ఎస్ఐ వి.వేమన తెలిపారు. గ్రామాలలో బెల్టు దుకాణాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న దృష్ట్యా గ్రామాలలో పోలీసు నిఘా ఉందని ఎస్ఐ తెలిపారు. మద్యం అమ్ముతూ పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేస్తున్నట్టు చెప్పారు.

## వృద్ధులకు వైద్య పరీక్షలు

చినగంజాం, జనవరి 6: చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని వాల్మీకి సేవా సంఘంలోని వృద్ధులకు పెదగంజాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వారు శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎదగంజాం ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ భవాని వైద్య పరీక్షలు చేసి ఆయుర్వేద మందులు అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సేవా సంఘం కార్యదర్శి లక్ష్మి, సూపర్‌వైజర్ గాజుల సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి బంగారు అభరణాలు బహూకరణ

చినగంజాం, జనవరి 6: స్థానిక భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలోని రాజ్యలక్ష్మి అమ్మవారికి బంగారు అభరణాలను శనివారం బహూకరించారు. చినగంజాం గ్రామానికి చెందిన తేలప్రోలు బాలకోటేశ్వర మనోజ్‌కుమార్, సుమతి దంపతులు రూ.1,50,100 విలువచేసే బంగారు మంగళసూత్రం తాడును మనోజ్‌కుమార్ తల్లిదండ్రులు శివరామకృష్ణ, నాగసుధారాణి చేతుల మీదగా ఆలయ పూజారి ఎ.లక్ష్మినరసింహా చార్యులకు అందజేశారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు యూటీఎఫ్ సంఘీభావం

పంగులూరు, జనవరి 6: తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు యూటీఎఫ్ మండల శాఖ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. శనివారం పంగులూరులోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగ ప్రతినిధులు ప్రసన్న, హరిబాబులకు రూ.ఐదు వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు టీవీ నరసింహారావు, బి.సుబ్బారావు, ఎస్‌వీడీ ప్రసాద్, సాయిసత్యనారాయణ, రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

## చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 6 : స్టేషన్ పరిధిలో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్సై జనార్దన్ పేర్కొన్నారు. శనివారం చీరాల మండల పరిధిలోని పిట్టువారిపాలెం పంచాయతి కొత్తపాలెంలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న దోనె బాలాజీని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 6 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## దాతల సహకారం మరువలేనిది

చిరగంజాం, జనవరి 6: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయానికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి అన్నారు. స్థానిక విద్యాలయానికి తహసీల్దార్ పాలపర్తి పార్వతి సొంత నిధులతో రెండు లైట్లు, ఐదు ఫ్యానులను శనివారం అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షేక్ కరీమా, భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీకాంత్, వీఆర్వోలు ఆమంచి సత్యనారాయణ, ఖాదర్ మొహిద్దీన్‌బాషా, వీఆర్ఏ వెంకటరావు, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీల ఉద్యమంపై 'ఎస్మా' పిరికిపంద చర్య

- సీఐటీయూ నేత కొండయ్య ధ్వజం
- కొనసాగుతున్న సమ్మె


బల్లికురవలో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పర్చూరు, జనవరి 6: అంగన్‌వాడీల ఉద్యమంపై ఎస్మా ప్రయోగించటం ప్రభుత్వ పిరికి పంద చర్యని సీఐటీయూ జిల్లా నాయకుడు పి.కొండయ్య ధ్వజమెత్తారు. నిర్బంధం, బెదిరింపు చర్యల ద్వారా చట్ట బద్ధ హక్కులను కాలరాయాలనుకోవటం దుర్మార్గమన్నారు. శనివారం కారంచేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెలో సీఐటీయూ నాయకులు పాల్గొని మద్దతుగా నిలిచారు. అంగన్‌వాడీలు తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ బాటపడితే కనీసం ప్రభుత్వం స్పందించక పోవటంతో పాటు, వివక్షకు గురిచేయటం ఏమిటని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ తమ సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

### ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా సమ్మె ఆగదు!

అద్దంకి టౌన్, జనవరి 6: ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా ఎలాంటి కుట్రలు చేసినా, బెదిరించినా సమ్మెను విరమించేది లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్మికులు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని అంగన్ వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో తంగిరాల వెంకటేశ్వర్లు, మనోలత, పెనుబాక ఆదాము, తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల వినూత్న నిరసన

బల్లికురవ, జనవరి 6: ప్రభుత్వం తమను ఎన్ని రకాలుగా బెదిరించినా తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. శనివారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని 64 మంది అంగన్ వాడీ కార్యకర్తలు, హెల్పర్లు 26వ రోజు సమ్మెలో పాల్గొన్నారు. వినూత్న రీతిలో 26 సంఖ్య నమూనాతో కుర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని న్యాయబద్ధంగా సమ్మె చేస్తుంటే ఎస్మా ప్రయోగించటం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, సునంద, భారతి, శ్రీదేవి, శ్రీ లలిత, సరస్వతి. అనురాధ, వెంకటరమణ, జ్యోతి, సత్యవతి, అను పమ, శివపావని, నిర్మల, రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు: వేతనం పెంచాలని కోరుతూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమని సీపీఎం నేత రాయిణి వినోద్‌బాబు అన్నారు. శనివారం పంగులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలకు ఆయన సంఘీభావం తెలిపారు. ఎస్మా పేరుతో తమను బెదిరించడంపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


చీరాల గడియార స్తంభం సెంటర్‌లో అంగన్‌వాడీల మానవహారం

ఇంకొల్లు: తమ న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగిస్తూ జీవోను విడుదల చేసి భయభ్రాంతులకు గురిచేయడం దారుణమని సీఐటీయూ మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు అన్నారు. సమస్య పరిష్కరించే వరకు సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శనివారం మండలంలోని గంగవరం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్లు సరళ, శ్రీలత, అనంతలక్ష్మి, లావణ్య, దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: అంగన్‌వాడీల సమ్మె మొదలై శనివారానికి 26వ రోజు కావడంతో మార్టూరులో 26వ సంఖ్య ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. మండల కాంప్లెక్స్ వద్ద సీఐటీయూ నాయకుల మద్దతుతో అంగన్‌వాడీలు తమ సమ్మెను కొనసాగించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బత్తుల హనుమంతరావు, యూనియన్ నాయకులు శ్యామల, రాణి, విజయ, అంజలి, రాజేశ్వరి, సుహాసిని, రాజ్యం, లలిత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా యద్దనపూడి మండలంలో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు.

చీరాలటౌన్: అంగన్‌వాడీలు శనివారం ఉదయం తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. మధ్యాహ్నం తరువాత గడియార స్తంభం వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వసంతరావు, ప్రమీల, సుజీవన, శిరీష, బ్యూలా, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసగించిన బీజేపీ



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలచంద్రుడునాయక్

అద్దంకిటౌన్, జనవరి 6: రాష్ట్రానికి సంజీవిని వంటి ప్రత్యేక హోదా ఇస్తానని బీజేపీ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి తొమ్మిదిన్నరేళ్లు అవుతున్న హోదా ఇవ్వకుండా 5 కోట్లమంది ప్రజలను మోసం చేసిందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.బాలచంద్రుడు నాయక్ అన్నారు. శనివారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బాలచంద్రుడు నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైపీసీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేద విద్యార్థులను చదువులకు దూరం చేసే విధంగా జీవో నెం. 77ను తీసుకువచ్చి స్కాలర్‌షిప్‌ను తీసివేశారని అన్నారు. ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ, ఇప్పుడు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదు కోట్ల ప్రజల ఆత్మ గౌరవాన్ని మోదీ కాళ్ల కింద వదిలేశారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, అందరికి న్యాయం జరగాలన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్‌గాంధి ప్రధాన మంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు బాబీ, ఏసుబాబు, యోబు, వినయ్, ప్రవీణ్, రాజా, వంశీ తదితరులు పాల్గొన్నారు.